కథ

# సమ్మర్ క్యాంప్

అబ్బరాజు జయలక్ష్మి

**అట్టహాసంగా వార్షిక పరీక్షలు ముగిశాయి. ఆనందంగా స్కూళ్లకు సెలవులు ఇచ్చేశారు. అట్టహాసంగా అని ఎందుకన్నానంటే పరీక్షలంటే మాటలా మరి. పిల్లలకు, పెద్దలకు అందరికీ అవంటే హడలే. గుండెల్లో గుబులే. పిల్లల్ని నిద్రపోనివ్వరు. పెద్ద వాళ్లు నిద్రపోరు. 'చదువు, చదువు' అని వెంటపడటమేగాక వాళ్లను వెంటపెట్టుకుని పరీక్ష సెంటర్‌కు తీసుకువెళ్లి, వాళ్లు లోపల పరీక్ష రాస్తుంటే వీళ్లు బయట ఎండలో చెట్ల కింద గోడల నీడల్లో వేచి ఉండి, మళ్లీ వాళ్లను ఇళ్లకు తీసుకురావాలి.**

ఇలా ఎంత తతంగం ఉంటుంది. మా పిల్లలే క్లాసులో ఫస్టు రావాలి అనుకుంటూ ఎవరికి వారు పోటీ పడుతూ పిల్లలను టెన్షన్‌కు గురిచేసి పెద్దవాళ్లు టెన్షన్ పడి ఎట్టకేలకు ఆ పరీక్షలు అనే మహాసంగ్రామం పూర్తయ్యేసరికి, ఫలితాలు తెలిసేటప్పటికి పురిటినొప్పుల నుండి బయటపడ్డట్టే ఉంటుంది అందరికీ. అందుకే సెలవులిచ్చేశారు అనగానే ఆనందం.

కానీ ఆ ఆనందం కూడా ఎంతోసేపు ఉండదు కదా! ఎందుకంటే పిల్లలను, వాళ్ల అల్లరిని ఉదయం నుండి సాయంత్రం వరకు భరించే స్కూళ్లు లేకపోతే వాళ్ల గోలంతా ఇక ఇంట్లోవాళ్లే భరించక తప్పదు కదా! అందుకేనన్నమాట, ఆ బాధ గుర్తొచ్చి 'సెలవులిచ్చేశారు, ఇక తన్నుకు చస్తాం' అంటూ అల్లరి చేసే గడుగ్గాయిల తల్లిదండ్రులకు ఆనందం కాస్తా ఆవిరయిపోతుంది.

సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే ఉన్న మీనాక్షి దగ్గరకు పక్కింటి పంకజం వచ్చి ఓ శుభవార్త చెవిన వేసింది.

''మీనాక్షీ! మా చింటూను సమ్మర్ క్యాంప్‌లో చేర్చాలనుకుంటున్నాం. నువ్వు కూడా మీ సిద్దూను పంపరాదూ! ఇద్దరూ తోడుగా వెళ్లొస్తారు.''

''సమ్మర్ క్యాంపా! అదేమిటి?'' అంది మీనాక్షి.

మీనాల్లాంటి కళ్లు లేకపోయినా తన చిన్న కళ్లను చికిలించి చూస్తూ ''అదేమిటి? నీకు తెలీదా? అయితే చెప్తాను విను'' అంటూ గీతను బోధించే శ్రీకృష్ణునిలా చెప్పసాగింది పంకజం.

''స్కూళ్లకు సెలవులిచ్చాక పిల్లలందరినీ చేర్చుకుని ఒక నెలరోజుల పాటు వాళ్లకు ఆటలు, పాటలు, డాన్స్‌లు, డ్రాయింగ్, రకరకాల వృత్తిపనులు, చేతి పనులలో శిక్షణ ఇస్తారన్నమాట. అదే 'సమ్మర్ క్యాంప్' అంటే.''

''ఇదేదో బాగానే ఉందే! ఇంట్లో పిల్లల అల్లరీ తగ్గుతుంది. హాయిగా మనం ఎప్పట్లాగానే టీవీ సీరియల్స్ అన్నీ చూసుకోవచ్చు. ఎంచక్కా మార్నింగ్ షోలకి కూడా వెళ్లచ్చు.''

''అవును కదా! అయితే ఇప్పుడే వెళ్లి ఇద్దరం ఫీజు కట్టేద్దామా?''

''అదొకటుంటుంది కదూ! మర్చిపోయాను. ఇంతకీ ఎంతేమిటి ఫీజు?''

''రెండు వేలు.''

''కెవ్వు'మంటూ అరిచి సోఫాలో కూలబడింది మీనాక్షి. మోతాదు మించిన ఏ భావాన్నయినా అలా పొలికేక పెట్టి ప్రదర్శించటం మీనాక్షికి ఉన్న ఒక బలహీనత. ఆ సంగతి తెలిసిన పంకజం కూడా ఒక్కసారి తూలి కింద పడి వెంటనే సర్దుకుని లేచి ''సరే! నే వెళ్తున్నా, ఆలోచించి చెప్పు'' అంటూ అక్కడి నుండి నిష్క్రమించింది.

చింటూ, సిద్దూ ఇద్దరూ యు.కె.జి. పూర్తిచేశారు! వేసవి సెలవుల తరువాత ఫస్ట్‌క్లాస్‌లోకి వెళతారు! వాళ్లకు ఇంకా ఆ వీధిలో రాము, గోపి, శశి, శర్వాణి, పింకీ, టింకూ అందరూ ఫ్రెండ్సే. ఏమాత్రం సమయం దొరికినా అందరూ కలసి ఎవరో ఒకరి ఇల్లు పీకి పందిరేస్తుంటారు.

★ ★ ★

పంకజం చెప్పిన సలహాను భర్త చెవిన వేసింది మీనాక్షి.

'చూద్దాంలే' అని ఊరుకున్నాడు మాధవ్.

''చూద్దాం అంటే కాదు. మీకేం మీరు ఆఫీసుకు వెళ్లి సాయంత్రం వస్తారు. వీడి గోల నేనేగా భరించాలి.''

'నువ్వసలు కన్నతల్లివేనా? అలా మాట్లాడతావేమిటి? చిన్నపిల్లాడు. వాడికెందుకు ఈ క్యాంప్‌లూ అవీను' అని అందామనుకున్నాడు మాధవ్. కాని అనలేదు. మీనాక్షి ఏదయినా అనుకుంటే ఆరు నూరయినా చేసి తీరుతుందని అతనికి తెలుసు.

''సరే వివరాలు కనుక్కో'' అంటూ ఆఫీసుకు వెళ్లిపోయాడు. ఇంట్లో పనులు చేస్తున్నా కూడా ఇదే ఆలోచనతో ఉన్నది మీనాక్షి. సిద్దూకు అన్నం పెట్టి తానూ తిని, టీవీ సీరియల్ చూస్తూ సోఫాలో కూచుంది. సిద్దూ తల్లి ఒడిలో తల పెట్టుకుని నిద్రకొరిగాడు.

ఏదయినా ఆలోచన బుర్రలో చేరిందంటే పురుగులా తొలుస్తూ ఉంటుందామెకు. అలా ఆలోచిస్తున్న మీనాక్షికి ఉన్నట్లుండి బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. అంతే! ఒక్కసారిగా 'కెవ్వు'మంటూ' అరిచింది. ఒళ్లో ఉన్న సిద్దూ ఉలిక్కిపడి లేచి ఏడుపు లంకించుకున్నాడు. వాడి వీపు మీద మెల్లగా తట్టుతూ ఉంటే ఏడుపు ఆపి మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు.

మీనాక్షికి వచ్చిన ఆ బ్రహ్మాండమైన ఐడియా ఏమిటంటే 'ఆ సమ్మర్ క్యాంప్ ఏదో తానే నిర్వహిస్తే ఎలా ఉంటుంది?' అని. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా దానికి కావల్సిన ప్లానింగ్ అంతా మనసులోనే చకచకా వేయసాగింది మీనాక్షి. ఒక్క నెల రోజులలోనే ఊహించని విధంగా ఆదాయం వస్తుందనిపించింది. ఇక ఖర్చుల విషయానికి వస్తే పిల్లలకు తను పద్యాలు, పాటలు, కథలు అన్నీ నేర్పించగలదు. తనకు తోడుగా మరొక ఇద్దరిని ఒకరిని డాన్స్ వచ్చినవాళ్లను, మరొకరిని ఆటలు ఆడించడానికి, అలాగే ఒక ఆయాను నియమించుకుంటే సరిపోతుంది. ఇక పిల్లల కోసం కొన్న ఆట వస్తువులు, చార్ట్స్, కలర్స్ ఇలా కొంత ఖర్చు పెట్టవలసి ఉంటుంది. ఎంత ఖర్చు చేసినా ఇంతే కదా! లాభం బాగానే ఉండవచ్చు. దానితో పాటు సిద్దూ కూడా ఎక్కడికీ వెళ్లవలసిన అవసరం లేకుండా ఆ పిల్లలతో పాటే అన్నీ నేర్చుకుంటాడు.

తనకు వచ్చిన ఆలోచనను ఎప్పుడెప్పుడు మాధవ్‌కి చెప్పి ఒప్పిద్దామా అని ఆరాటపడిన మీనాక్షికి ఆరోజు టైమ్ చాలా నిదానంగా గడిచి

సాయంత్రం అయింది.

★ ★ ★

''ఇది సాధ్యమయ్యే పనేనా? నీవల్ల అవుతుందా?'' వింటూనే తన సందేహాన్ని వ్యక్తం చేశాడు మాధవ్.

''నేను ఒక్కదాన్ని కాదుకదా! నాకు సహాయంగా మరో ఇద్దరిని తీసుకుంటాను. ఆయా కూడా ఉంటుంది.''

''కానీ పిల్లలతో కూడిన వ్యవహారం కదా! రిస్క్ తీసుకోవటం అవుతుందేమో, ఆలోచించు.''

''అన్నీ ఆలోచించుకునే ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. మీరు అడ్డుచెప్పకుండా ఉంటే అదే పదివేలు'' అన్నది మీనాక్షి.


''ఫీజు ఎంతనుకుంటున్నావు?''

''ఒక్కొక్కరికి ఐదువందల రూపాయలు చొప్పున తీసుకుందామనుకుంటున్నాను. అలా అయితే మరీ ఎక్కువ, తక్కువ కాకుండా ఉంటుంది. ఎక్కువమంది పిల్లలు కూడా చేరవచ్చు.''

''బాగుంది. మరి నీ టీవీ సీరియల్స్, సిని వాలు

సిద్దూను చూడటానికి ఒక పనిపిల్లను ఏర్పాటుచేసుకుంది.

వారం రోజుల్లో 15 మంది వరకు పిల్లలు చేరారు. ఒక సాయంత్రం మీనాక్షి, మాధవ్ షాపింగ్‌కు వెళ్లి చిన్న పిల్లలకు పనికి వచ్చేవి,



డా

అన్నీ మిస్ అవుతావేమో'' అన్నాడు మాధవ్, ఆఖరి ప్రయత్నంగా ఆమె నిర్ణయం స్థిరమైనదా కాదా అని తెలుసుకోవటానికన్నట్లు.

''అవన్నీ ఎప్పుడూ ఉండేవే కదా! ఈ ఆదాయం ముందు అవెంత చెప్పండి?'' అన్నది మీనాక్షి తన నిర్ణయానికి తిరుగులేదన్నట్లు.

''సరే! నీ ఇష్టం'' అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు మాధవ్.

★ ★ ★

సమ్మర్ క్యాంప్ ఉంటుందంటూ దానికి సంబంధించిన వివరాలతో పాంప్లెట్స్ వేయించి ముఖ్యమైన దినపత్రికల ద్వారా చుట్టుపక్కల కొన్ని ప్రాంతాల్లో ప్రచారం జరిగేలా చూసింది మీనాక్షి. ఆ మర్నాటినుండే బిజీ అయిపోయింది. ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకోవటం, అడ్రసు వెతుక్కుంటూ వచ్చినవాళ్లకు వివరాలన్నీ చెప్పటం, పిల్లల జాగ్రత్తల గురించి హామీలివ్వటం, ఫీజు కట్టించుకోవటం, ఇలా ఊపిరి సలపకుండా ఉంటోంది. మాధవ్ ఆఫీసుకు వెళ్లేలోగా ఇంటి పనులు పూర్తి చేసుకుంటోంది.

ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు కొన్ని ఆట వస్తువులు, బొమ్మలు అన్నీ కొనుక్కుని వచ్చారు. డ్రాయింగ్ రూముగా ఉన్న పెద్ద రూమ్‌ను సమ్మర్ క్యాంప్ కోసం కేటాయించారు. ఒక డాన్స్ టీచర్‌ను, డ్రాయింగ్, ఆటలు నేర్పటానికి ఒక టీచర్, ఒక ఆయాను ఏర్పాటు చేయటం కూడా అయిపోయింది. ఫీజు లేకుండానే చింటూ ఈ క్యాంప్‌లో పాల్గొనేటట్లుగా ఒప్పందం కుదుర్చుకుంది పక్కింటి పంకజం. మరి ఈ సలహా ఇచ్చింది ఆమే కదా! సరే అనక తప్పలేదు మీనాక్షికి.

పది రోజులు గడిచాయి. ఉదయం పది గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు క్యాంప్ టైమింగ్స్. ఇక ఇల్లంతా కిష్కింధకాండలా ఉంటుంది ఆ సమయంలో. 4 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల లోపు వయసు వాళ్లే అంతా. దాదాపుగా ఆ వీధిలోని సిద్దూ ఫ్రెండ్స్ అందరూ చేరారు. మొదట్లో కొన్ని రోజులు కొత్తగా చేరిన పిల్లలు అల్లరి, ఏడుపులతో గందరగోళం చేశారు. వాళ్ల ఏడుపులు ఆపనికి నానా అవస్థ పడవలసి వచ్చేది. వాళ్ల రాగాలు ఆగి అలవాటు పడేసరికి వారం రోజులు పట్టింది.

తను చిన్నప్పుడు నేర్చుకున్నవి, కొత్తగా సేకరించినవి పద్యాలు, పాటలు, శ్లోకాలు అన్నీ పిల్లలకు రాగయుక్తంగా నేర్పసాగింది మీనాక్షి. పిల్లల మూడ్‌ను బట్టి కథలు, కబుర్లు, ఆటలు, పాటలు ఇలా జరిగేవి. లయబద్ధంగా అడుగులు వేస్తూ పిల్లలు డాన్స్ నేర్చుకుంటుంటే చూడముచ్చటగా ఉండేది.

మరో పది రోజులు గడిచాయి. మీనాక్షికి చిన్న పిల్లలతో కాలక్షేపం బాగానే ఉందనిపించినా కొన్ని ఇబ్బందులను కూడా ఎదుర్కోక తప్పలేదు. పిల్లలు వాళ్ల టిఫిన్ బాక్స్‌లు ఖాళీ చేసి మళ్లీ ఆకలవుతోందని గొడవ చేసేవారు. పోనీ పాపం అని ఫ్రిజ్‌లో నుండి పండ్లు, చాక్‌లెట్లు, బిస్కెట్స్ కూడా తెప్పించి పెట్టేది. అవన్నీ తిని నేలమీదే పడుకుని నిద్రకొరిగేవాళ్లు. ఒకరోజు ఇద్దరు పిల్లలు కొట్టుకుంటూ కింద పడటంతో ఒకడి తలకు దెబ్బ తగిలి నుదురు చిట్లితే

వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్లింది. డాక్టర్ ఫీజు, మందులు అన్నిటికీ డబ్బులు ఖర్చుపెట్టింది. అయినా తల్లిదండ్రులు వచ్చి ఇంత అజాగ్రత్తగా ఉంటే ఎలాగ? అంటూ పోట్లాటకు దిగారు. ఎలాగో సర్దిచెప్పేసరికి తాతలు దిగి వచ్చినట్లయింది. పిల్లలు కిందపడ్డా దెబ్బ తగలకుండా ఉంటుందని మర్నాడే మెత్తటి కార్పెట్ కొని హాల్లో వేయించింది.

''ఎందుకొచ్చిన రిస్క్? వద్దంటే విన్నావు కాదు'' అంటూ నసిగాడు మాధవ్.

నెల రోజులు పూర్తయి క్యాంప్ ముగిసేసరికి ఒక మహాయజ్ఞం చేసినట్లయింది మీనాక్షికి. పెద్ద తుఫాన్ వచ్చి వెలసినంత ప్రశాంతత ఏర్పడింది ఇంట్లో.

ఆరోజు మీనాక్షి తీరిగ్గా కూర్చుని నెల రోజులు తను నిర్వహించిన సమ్మర్ క్యాంప్ వల్ల వచ్చిన ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలను చూస్తోంది. ఆదాయాన్ని మించిన వ్యయాన్ని చూసి కెవ్వుమంది మీనాక్షి. తాగుతున్న కాఫీ కప్పును వదిలేశాడు మాధవ్. వళ్లంతా ఒలికిన వేడి కాఫీ చురుక్కుమంది. అంతకన్నా చురుకైన చూపులతో మీనాక్షిని చూస్తూ ''ఎందుకలా అరిచావ్?'' అంటూ అలవాటైన ప్రశ్ననే వేశాడు.

''ఈ లెక్కలు చూస్తుంటే నాకు తల తిరిగిపోతోందండీ!''

''ఓహో! అయితే లాభాలు బాగానే వచ్చాయన్నమాట. అందుకే ఆనందం పట్టలేకపోతున్నావా! కంగ్రాట్స్. ఏమో అనుకున్నాగానీ...''

''అది కాదండీ! మనం అనుకున్నదొకటి, అయినది ఒకటి అన్నట్లు లాభం లేకపోగా ఖర్చులే ఎక్కువగా ఉన్నాయండి.''

''అందరూ ఫీజులు చెల్లించలేదా!''

''కొంతమంది వాయిదాలుగా కడతామంటే ఒప్పుకున్నాను. వాళ్లు కట్టలేదు సరికదా ఇప్పుడేమో ఏదో ఒకటి చెప్పి తప్పించుకుంటున్నారు. ఇక డాన్స్ టీచర్, డ్రాయింగ్ టీచర్, ఆయాకు జీతాలు. మధ్యలో డాక్టర్ ఫీజులు, కార్పెట్, పిల్లల కోసం కొన్న ఆట వస్తువులు, ఇతర సామాన్లు- ఇలా అన్నీ కలిసి తడిసి మోపెడన్నట్లు మన చేతి డబ్బులే ఖర్చయ్యాయి'' అంటూ చెప్పటం ఆపి నీరసంగా నిట్టూర్చింది మీనాక్షి.

''నేను అప్పుడే చెప్పానా! ఇదంతా ఎందుకొచ్చిన గొడవ, వద్దు అని. అంతగా కావాలంటే మనవాడిని ఎక్కడన్నా చేర్పిస్తే సరిపోయేది. డబ్బు ఖర్చయినందుకు నేను బాధపడటం లేదు. ఇలాంటి క్యాంప్‌లు నడపాలంటే కొంచెం కఠినంగా వ్యవహార దక్షతతో లౌక్యంగా నడుచుకోవాలి. నీకు వృథాప్రయాస తప్ప చివరకు మిగిలిందేమిటి?''

''కానీ మీరలా అంటే నేను ఒప్పుకోను. నేను చాలా కష్టపడి పిల్లలకు వాళ్లు చదువుకునే ఏ స్కూల్లోనూ నేర్పనటువంటి కమ్మని తెలుగు పద్యాలు, పాటలు, నీతి కథలు, సంస్కృత శ్లోకాలు నేర్పించాను. తెలుగులో చక్కగా మాట్లాడటం కొంతవరకు నేర్పగలిగాను. నాకు ఈ సంతృప్తి చాలండీ! మన సిద్దూ కూడా పిల్లలందరితో కలసి బాగానే ఎంజాయ్ చేశాడు. ఇక డబ్బు విషయమంటారా? ప్లానింగ్ సరిగ్గా ఉంటే, మీరన్నట్లు కచ్చితంగా వ్యవహరించగలిగి ఉంటే బాగుండేదేమో. చూద్దాం! బెటర్ లక్ నెక్స్ట్ టైమ్'' అన్నది మీనాక్షి రేపటి మీది కాదు, వచ్చే సమ్మర్‌లో నిర్వహించబోయే క్యాంప్ మీది ఆశతో.

ఇంతలో 'ట్రింగ్ ట్రింగ్'మంటూ ఫోన్ మోగింది. మీనాక్షి రిసీవర్ తీసి చెవి దగ్గర పెట్టుకున్నదల్లా వెంటనే ఆ చేతిని వీలయినంత దూరంగా చాపింది. అయినా ఆ ఫోన్‌లో నుండి వినిపిస్తున్న మాటలు లౌడ్ స్పీకర్‌లో నుండి వినబడుతున్నట్లుగా ఉన్నాయి.

''ఏమమ్మా! సమ్మర్ క్యాంప్ అని చెప్పి మా పిల్లలకు తెలుగు నేర్పిస్తావా! వచ్చిన ఇంగ్లీషు ముక్కలు కాస్తా మర్చిపోయేలా చేస్తావా! పద్యాలు, శ్లోకాలు పాడుతూ మా పిల్లలు స్టేజి ఎక్కి నాటకాలేమయినా వెయ్యాలా? తెలుగు తెగులు పట్టిస్తావా మా పిల్లలకు?'' అంటూ పరుషంగా తిట్ల దండకం పలుకుతున్న కంఠం విని మీనాక్షి కెవ్వుమంటూ కేక వేసి రిసీవర్‌ని వదిలేసింది.

అప్పుడే రిలాక్స్‌గా మంచం మీద వాలిన మాధవ్ అంతెత్తున ఎగిరి పడ్డాడు. పెరటిగుమ్మంలో నుండి వంటింట్లోకి రాబోయిన పిల్లి వెనక్కి తిరిగి పరిగెత్తింది.

సిద్దూ మాత్రం ఇవేమీ పట్టనట్లు ''మా తెలుగుతల్లికి మల్లెపూదండ, మా కన్నతల్లికి మంగళారతులు'' అంటూ పాడుకుంటున్నాడు.

## ఇలియానా... ఇలియానా!

**ఇప్పుడు ఇలియానా ప్రభంజనం వీస్తోంది! కుర్ర ప్రేక్షకుల్ని ఎవర్ని కదిలించినా నా ఫేవరెట్ ఇలియానా అంటున్నారు. తన అందచందాలతో 'దేవదాసు' చిత్రం ద్వారా ఆకట్టుకున్న ఇలియానా- 'పోకిరి'తో ఫుల్ క్రేజ్‌ని సొంతం చేసేసుకుంది. అయితే అన్ని భాషల్లోనూ తనకి అవకాశాలు వస్తున్నా 'నా తొలి ప్రాధాన్యత తెలుగు చిత్రాలకే' అని చిలకపలుకులు పలుకుతోందీ గోవా భామ.**

